క్లుప్తంగా

వీరేశ్వర అన్నదాన ట్రస్టుకు విరాళం



భక్తుడు సుబ్బారావుకు స్వామివారి చిత్రపటం, ప్రసాదం అందజేసి సత్కరిస్తున్న కమిషనర్ సత్యనారాయణ

ఐ.పోలవరం: నిత్య కల్యాణం పచ్చతోరణంగా విరాజిల్లుతున్న మురమళ్ల వీరేశ్వర అన్నదాన ట్రస్టుకు శనివారం రాజమహేంద్రవరానికి చెందిన భక్తుడు ఉయ్యూరు వీరవెంకటసత్యసుబ్బారావు రూ.27 వేలు వీరేశ్వర అన్నదాన ట్రస్టుకు అందించారు. ఈ సందర్భంగా దాతలకు స్వామి చిత్రపటం, శేషవస్త్రం, ప్రసాదాన్ని ఆలయ సహాయ కమిషనర్, కార్యనిర్వాహణాధికారి వి.సత్యనారాయణ అందజేసి సత్కరించారు. ఆలయ అర్చకులు ఆధ్వర్యంలో దాతకు ప్రత్యేక దర్శనం అందించారు.

ఆటోడ్రైవర్లు నిబంధనలు పాటించాలి

యానాం: పట్టణంలో తిరిగే ఆటో వాహనాల డ్రైవర్లు నిబంధనలు పాటించాలని, పోలీస్‌శాఖకు సహకరించాలని ట్రాఫిక్ ఎస్సై శేరు నూకరాజు పేర్కొన్నారు. శనివారం ట్రాఫిక్ స్టేషన్‌లో ఆటోడ్రైవర్లు, వాహనాల యజమానులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఆటోల్లో నిబంధనలకు మించి ప్రయాణికులను తరలించరాదని, వాహనాల ఫిట్‌నెస్‌ను ఎప్పటికప్పుడు తనిఖీ చేయించుకోవాలని, డ్రంక్ అండ్ డ్రైవ్, డ్రగ్స్ వంటి మాదక ద్రవ్యాల తరలింపు వంటి చట్టవిరుద్ధ పనులకు పాల్పడితే చట్టప్రకారం చర్యలుంటాయన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ పోలీసులు పాల్గొన్నారు.

కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు చర్యలు అభినందనీయం

అమలాపురం టౌన్: అల్లవరం మండలం ఓడలరేవు ప్రాంతంలో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటు చేయాలన్న చర్యలు అభినందనీయమని ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు అన్నారు. అమలాపురంలోని తన క్యాంపు కార్యాలయంలో శనివారం నిర్వహించిన పార్టీ నాయకుల సమావేశంలో ఎమ్మెల్సీ మాట్లాడారు. కోనసీమ అలాంటి కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు కృషి చేస్తున్న ఎంపీ గంటి హరీష్ మాధూర్‌ను ఎమ్మెల్సీ అభినందించారు. ఓడలరేవు కేంద్రీయ విద్యాలయం కోసం రూ.3.30 కోట్ల మంజూరుతోపాటు 7.50 ఎకరాల భూసేకరణకు ఉత్తర్వులు జారీ చేయడాన్ని ఆయన స్వాగతించారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ నాయకులు మట్టపర్తి నాగేంద్ర, కుడుపూడి త్రినాథరావు, దండుమేను రూపేష్, ముంగర ప్రసాద్ పాల్గొన్నారు.

14న మంత్రిగా జాన్‌కుమార్ ప్రమాణం

యానాం: పుదుచ్చేరి మంత్రిగా జాన్‌కుమార్ నియామకాన్ని కేంద్ర ప్రభుత్వం ఆమోదించడంతో ఆయన ఈనెల 14 సోమవారం ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శరత్‌చౌహాన్ ప్రమాణ స్వీకారానికి సంబంధించి ఆహ్వానపత్రాలను విడుదల చేశారు. జాన్‌కుమార్‌తో ఎల్జీ కైలాసనాథన్ ప్రమాణస్వీకారం చేయించనున్నారు. మరో ముగ్గురు నామినేటెడ్ ఎమ్మెల్యేలు తీఫైన్‌థన్, జీఎన్ఎస్ రాజశేఖరన్, వి.సెల్వంతో అదేరోజు అసెంబ్లీలో స్పీకర్ ఆర్ సెల్వం ప్రమాణస్వీకారం చేయించనున్నారు.

రామకృష్ణకు ఘన సత్కారం



రామకృష్ణను సత్కరిస్తున్న రమణారావు

అల్లవరం: మండలానికి చెందిన చింతా రామకృష్ణను అంబేడ్కర్ కోనసీమ జిల్లా వైఎస్సార్ సీపీ ఆర్గనైజింగ్ కార్యదర్శిగా పార్టీ అధిష్టానం నియమించింది. రామకృష్ణను శనివారం అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ సీనియర్ వైఎస్సార్ సీపీ నాయకుడు, గుడ్ సీడ్ ఫౌండేషన్ ఫౌండర్ కుంచే రమణారావు అభినందించి సత్కరించారు. రామకృష్ణను దుశ్శాలువా కప్పి పూలమాలలతో ఘనంగా సత్కరించారు. పదవి ద్వారా పార్టీ బలోపేతానికి కృషిచేసి, సంక్షేమ పాలన అందించిన వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసేందుకు కష్టపడి పని చేయాలని రమణారావు సూచించారు.

ఘనంగా పోలేరమ్మ జాతర



తాళ్లరేవు: పోలేకుర్రు గ్రామదేవత పోలేరమ్మ జాతర మహోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ ఉత్సవాల్లో భాగంగా అమ్మవారి జాతరను శనివారం రాత్రి గరగ నృత్యాలు, డప్పుల వాయిద్యాలతో ఘనంగా నిర్వహించారు. భక్తులు భక్తిశ్రద్ధలతో మొక్కులు సమర్పించారు. ఆదివారం అమ్మవారి తీర్థం ఘనంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేసారు. ఈ సందర్భంగా ఆలయాన్ని విద్యుద్దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. తీర్థ మహోత్సవం సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు.

జల్‌జీవన్ మిషన్ పనులు అస్తవ్యస్తం

- ప్రజలకు అందని తాగునీరు
- అసంపూర్తిగా ఓహెచ్‌ఆర్ ట్యాంకుల నిర్మాణం
- పెండింగ్ బిల్లుల చెల్లింపులో కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం
- ప్రజల ఇక్కట్లను పట్టించుకోని పాలకులు, అధికారులు



ఈదరపల్లిలో మంచినీటి ఫిల్టర్ బెడ్‌లో పెరిగిన గడ్డి



అమలాపురం కలెక్టరేట్ వద్ద వన్నెచింతలపూడి గ్రామస్తుల నిరసన (ఫైల్)

అమలాపురం రూరల్: తాగునీరు అందరికీ పుష్కలంగా లభించాలంటే క్షేత్రస్థాయిలో నీటి వనరులు అందుబాటులో ఉండాలి. నీటి వనరులు అందుబాటులో లేకున్నా ప్రజల నీటి అవసరాలను తీర్చేందుకు ప్రభుత్వం ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలి. గ్రామాల్లో నీటిని సరఫరా చేసేందుకు అనువైన ఓవర్ హెడ్ ట్యాంకులు అందుబాటులో ఉండాలి. గ్రామాల్లో గతంలో నిర్మించిన ట్యాంకులు శిథిలావస్థకు చేరుకున్నాయి. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో జాతీయ జల్‌జీవన్ మిషన్‌లో భాగంగా మంజూరైన నిధులతో అవసరమైన చోట ఓహెచ్‌ఆర్ ట్యాంకుల నిర్మాణం చేపట్టింది. వాటిని పూర్తిచేయడంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి 13 నెలలైనా నిర్లక్ష్యం వహిస్తోంది. శివారు ప్రాంతాల ప్రజలకు పూర్తిస్థాయిలో తాగునీరు అందడం లేదు.

ఇప్పటికీ ఆదుకుంటున్న ఆనాటి రక్షిత నీటి పథకాలు

అమలాపురం నియోజకవర్గంలో మాజీ ఎంపీ కేఎస్ఆర్ మూర్తి రూరల్ వాటర్ స్కీమ్ పథకంలో శివారు గ్రామాల వరకు పైప్‌లైన్లు వేసి తాగునీటి సరఫరాకు చర్యలు తీసుకున్నారు. రూరల్ వాటర్ స్కీమ్ ద్వారా అల్లవరం మండలంలో గుండెపూడి, ఉప్పలగుప్తం మండలంలో చల్లపల్లి, అమలాపురం మండలంలో పేరూరులో వేసవిలో నీటి ఎద్దడి రాకుండా సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ నిర్మించారు. దానికి అనుబంధంగా ఫిల్టర్ బెడ్లు ఓహెచ్ఎస్ ట్యాంకులు నిర్మించి రక్షిత నీటిని ప్రజలకు అందించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో అప్పటి గ్రామీణ నీటి సరఫరాల శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ అల్లవరం మండలంలో రూ.40 కోట్లతో అల్లవరం మండలం బొడసుకుర్రు, అమలాపురం మండలం చిందాడగరువు, ఉప్పలగుప్తం మండలం భీమనపల్లి, కూనవరంలో మంచినీటి పథకాలు నిర్మించారు. ఈ పథకాల ద్వారా సుమారు 40 గ్రామాలకు నేడు తాగునీరు సరఫరా చేస్తున్నారు.

అసంపూర్తిగా జల్‌జీవన్ మిషన్ ట్యాంకులు

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జల్‌జీవన్ మిషన్ ఫేజ్–2లో అమలాపురం నియోజవర్గంలో మండలానికి రూ.7.కోట్లతో 12 నుంచి 25 ఓహెచ్‌ఆర్ ట్యాంకుల నిర్మాణానికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నిధులు కేటాయించింది. అప్పట్లో దాదాపు ట్యాంకుల నిర్మాణానికి శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. వీటిలో 50 శాతం ట్యాంకుల పనులు పూర్తి చేశారు. మరో 50 శాతం అసంపూర్తిగా ఆగిపోయాయి. ఈ పనులు చేపట్టిన కాంట్రాక్టర్లకు కూటమి ప్రభుత్వం బిల్లులు ఇవ్వకపోవడంతో ఎక్కడ పనులు అక్కడే నిలిచిపోయాయి. అమలాపురం మండలంలో సుమారు రూ.8 కోట్లు 25 హెచ్‌ఆర్ ట్యాంకుల నిర్మాణానికి కేటాయించారు. కామనగరువు ఒకటో వార్డు, చిట్టిమ్మచెరువు, మెట్ల సత్యనారాయణ కాలనీలో 80 శాతం పనులు పూర్తి చేశారు. వన్నెచింతలపూడి ఉప్పచెరువు, కొత్త కాలనీలో పనులు పూర్తిచేసిన ట్యాంకులకు పైప్‌లైన్ ఏర్పాటు చేయలేదు. దీంతో ఆయా గ్రామాల్లో శివారు ప్రాంతాలకు తాగునీరు అందక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. తాండవపల్లి, పేరూరు లంకతోట, రజకపేట, నారాయణపేట, సాకుర్రులో సంపద కేంద్రం వద్ద ట్యాంకు నిర్మాణ పూర్తిచేశారు. పైపులైన్ పనులు నిలిచిపోయాయి. ఈ అంశంపై మండల సమావేశాల్లో ప్రజాప్రతినిధులు ప్రశ్నించినా అధికారుల నుంచి స్పందన లేదు.

శిథిలమవుతున్న ఫిల్టర్ బెడ్లు

ఉప్పలగుప్తం మండలంలో రూ.7 కోట్లతో 24 ట్యాంకుల నిర్మాణం చేపట్టారు. వీటిలో 10 వరకు పూర్తిచేసినా ప్రారంభం కాలేదు.14 ట్యాంకులు నిర్మాణంలో ఉన్నాయి. విలసవిల్లి, నంగవరం, చిన గాడవెల్లి, సూదాపాలెం, ఉప్పలగుప్తం బడుగుపేటలో ట్యాంకులు పూర్తి కావాల్సి ఉంది. ఈదరపల్లిలో రక్షిత మంచినీటి పథకం ఫిల్టర్ బెడ్లు పాడైపోవడంతో గ్రామస్తులు తాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పంచాయతీ వద్ద ఉన్న ఒక ఫిల్టర్ బెడ్‌లోగడ్డి, పిచ్చి మొక్కలతో నిరుపయోగంగా మారిందని వారు తెలిపారు. పేరూరు నుంచి మంచినీటి సరఫరా అరకొరగా ఉందని అధికారులు తక్షణమే ఫిల్టర్లను మరమ్మతులు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. అల్లవరం మండలంలో దేవగుప్తం, డి.రావులపాలెం గ్రామాల్లోని ఓహెచ్‌ఆర్ ట్యాంకు పగుళ్లు ఏర్పడ్డాయి. మెట్టు విరిగిపోయాయి. అల్లవరం మండలంలో దేవగుప్తం, ఎస్.పల్లిపాలెం, ఎంట్రికోన, గోడి, ఆకులవారిపేట, బొడసకుర్రు తదిర 12 ఓహెచ్‌ఆర్ ట్యాంకు నిర్మాణం చేపట్టారు. ఏడు ట్యాంకులను పూర్తిచేశారు. బొడసకుర్రు అల్లవరం, మొల్లేటిగరువు, సీతారామపురం, కలగటవారిపేట, గుడాల వద్ద పునాది స్థాయిలో ఆగిపోయాయి. దేవగుప్తం, ఎస్.పల్లిపాలెం, ఎంట్రికోన వద్ద పైపులైన్ పనులు పెండింగ్‌లో ఉన్నాయి.

ట్యాంకు నిర్మాణాన్ని పూర్తి చేయాలి



వన్నెచింతపూడిలో పర్రిపేటలో తాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. గ్రామంలోని కొత్తకాలనీలో ట్యాంకు నిర్మాణ పూర్తిచేశారు. పైప్‌లైన్ వేయకపోవడం వల్ల కుళాయిల నుంచి నీరు రావడంలేదు. ప్రజాప్రతినిధులు, అధికారులకు మొర పెట్టుకున్నా నీటి సమస్య పరిష్కారం కాలేదు. తాగునీటి ఇబ్బందులపై కలెక్టర్‌కు వినతిపత్రం అందించాం. అధికారులు ట్యాంకు నిర్మాణ పూర్తిచేసి తాగునీటిని అందించాలి.

– పరమట దుర్గాభవాని, వన్నెచింతలపూడి, పర్రిపేట

కూటమి మోసాలను ప్రజలకు వివరించాలి

- నేడు బాబు ష్యూరిటీ – మోసం గ్యారంటీ సమావేశం
- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ శ్రీకాంత్



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ అమలాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ శ్రీకాంత్

అమలాపురం రూరల్: బాబు ష్యూరిటీ – మోసం గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా ఆదివారం మధ్యాహ్నం 2 గంటలకు అమలాపురం వాసర్ల వెంకన్న కల్యాణ మండపంలో నిర్వహించే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అమలాపురం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి డాక్టర్ పినిపే శ్రీకాంత్ పిలుపునిచ్చారు. భట్నవెల్లిలో అమలాపురం వైఎస్సార్ సీపీ పార్లమెంటు ఇన్‌చార్జి మాజీ మంత్రి పినిపే విశ్వరూప్ నివాసం వద్ద శ్రీకాంత్ అధ్యక్షతన శనివారం అమలాపురం పట్టణ, అమలాపురం మండలాల వైఎస్సార్ సీపీ వార్డు కమిటీ అధ్యక్షులు, గ్రామ కమిటీ అధ్యక్షులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో శ్రీకాంత్ మాట్లాడుతూ బాబు ష్యూరిటీ – మోసం గ్యారంటీ కార్యక్రమంపై కౌన్సిలర్లు, పార్టీ నాయకులకు, గ్రామ కమిటీ అధ్యక్షులకు దిశా నిర్దేశం చేసి వార్డుల్లో గ్రామాలు చంద్రబాబు ఎన్నికల హామీల మోసాలపై కార్యకర్తలు ప్రచారం చేయాలని అన్నారు. ఈ సమావేశంలో పట్టణ అధ్యక్షుడు సంసాని వెంకటచంద్రశేఖర్ (నాని) రూరల్ మండల అధ్యక్షుడు గుత్తుల చిరంజీవిరావు, జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు మట్టపర్తి నాగేంద్ర, నాయకులు కుడుపూడి భారత్ భూషణం, చొల్లంగి సుబ్బిరామ్, బొక్క నరసింహమూర్తి, కౌన్సిలర్లు గొవ్వాల రాజేష్, చిట్టూరి పెదబాబు, కట్టోజు సన్యాయిదాసు, యాండమూరి గంగా, బండారు గోవింద్, దొంగ నాగ సూధ రాణి, వార్డు కమిటీ, గ్రామ కమిటీ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం



ప్రమాణ స్వీకారం చేసిన రోటరీ క్లబ్ నూతన కార్యవర్గం

మలికిపురం: సామాజిక సేవలు అందించడంలో రోటరీ క్లబ్ స్వచ్ఛంద సంస్థ ముందుంటుందని ఆ క్లబ్ ఫౌండేషన్ రీజినల్ చైర్ పర్సన్, ఇన్స్టలేషన్ అధికారి ఎంఎస్ వాసు అన్నారు. మలికిపురం రోటరీ క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం మలికిపురంలో జరిగింది. నూతన అధ్యక్షుడిగా గెడ్డం ఫిలిప్ రాజు, కార్యదర్శిగా డాక్టర్ బందెల సంపత్, కోశాధికారిగా దొంగ రవిచంద్రలతో వాసు ప్రమాణ స్వీకారం చేయించారు. 40 సంవత్సరాలుగా సేవలను అందిస్తున్న ఈ క్లబ్ ఇకపై అదే సేవా కార్యక్రమాలు కొనసాగిస్తూ ముందుకు సాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ గవర్నర్ గన్నాబత్తుల సత్యవతి కూడా ప్రసంగించారు. పాస్ట్ ప్రెసిడెంట్ బత్తుల ఝాన్సీబాయ్‌ని సభ్యులందరూ గత సంవత్సరం చేసిన సేవా కార్యక్రమాలకు సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ సభ్యులు రాపాక విజయరావు గుబ్బల బాబ్జి, డాక్టర్ గొల్ల జేసురత్నం, సందెపూడి ఆదమ్, అల్లూరి మధురాజు డాక్టర్ ఎస్.రవి, మట్టా రవికుమార్, తోలేటి సతీష్, పీవీవీ ప్రసాద్, గెడ్డం తులసి భాస్కరరావు నల్లి శివకుమార్, గడ్డం పేర్‌రాజు, మరియు రాజకీయ నాయకులు ప్రజాసంఘాల సభ్యులు అభిమానులు, పాల్గొని నూతన కార్యవర్గ సభ్యులను అభినందించారు.

కుళాయిల నుంచి కలుషిత జలాలు



చిందాడగరువు ప్రాజెక్ట్ నుంచి కుళాయిల ద్వారా వచ్చిన పసుపు రంగునీరు

అమలాపురం రూరల్: చిందాడ గురువు రక్షిత పథకం ద్వారా కలుషిత జలాలు సరఫరా అవుతున్నాయని పలు గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. క్లోరినేషన్ సక్రమంగా చేయడంలేదని ప్రజలు ఆరోపించారు. ప్రతిరోజు 14 గ్రామాల్లోని వేలాది మంది ప్రజలకు ఈ ప్రాజెక్ట్ దాహం తీర్చుతుంది. నీటిని శుద్ధి చేయడంలో ప్రమాణాలు పాటించడం లేదని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. కొన్ని రోజులుగా పసుపు రంగు నీరు కుళాయిల ద్వారా వస్తోందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తరచూ ఇటువంటి రంగు మారిన నీళ్ల రావడంపై ప్రజలు గగ్గోలు పెడుతున్నా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. ఈ ప్రాజెక్టు నిర్వహణకు ఏటా లక్షలాది రూపాయలు ఖర్చు చేస్తున్నారు. కాంట్రాక్ట్ పద్ధతిలో ఈ ప్రాజెక్ట్ నిర్వహణ సాగుతున్నప్పటికీ మంచి నీటి నాణ్యత ప్రమాణాలు అంతగా పాటించడం లేదంటూ పలువురు అన్నారు. అధికారులు స్పందించి తాగునీటి సరఫరాను మెరుగుపరచాలని ప్రజలు కోరుతున్నారు.

మెగా వైద్య శిబిరం ఏర్పాట్లపై సమీక్ష

అమలాపురం టౌన్: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఆర్య వైశ్య సంఘం, అమలాపురం పట్టణ వైశ్య సంఘం సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరి కల్యాణ మండపంలో ఆదివారం నిర్వహించనున్న ఉచిత మెగా వైద్య శిబిరం సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఉమ్మడి జిల్లా సంఘం అధ్యక్షుడు కంచర్ల బాబి విజ్ఞప్తి చేశారు. వైద్య శిబిరంలో వెరికోస్ వెయిన్స్, గుండె, ఆర్థోపెడిక్, గ్యాస్ట్రో, స్కిన్, గైనిక్, డెంటల్, ఈఎన్టీ, జనరల్ మెడిసన్ తదితర విభాగాలకు వైద్య సేవలు అందించేందకు ఆ వైద్య విభాగాల వైద్య నిపుణులు సిద్ధంగా ఉంటారని తెలిపారు. ఆయా విభాగాల్లో పరీక్షలు చేసి మందులు ఉచితంగా అందిస్తారని తెలిపారు. స్థానిక వాసవీ కల్యాణ మండపంలో శనివారం సాయంత్రం నిర్వహించిన ఉమ్మడి జిల్లా వైశ్య ప్రతినిధుల సమావేశంలో మెగా ఉచిత వైద్య శిబిరం ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ సమావేశంలో ఉమ్మడి జిల్లా ఆర్య వైశ్య సంఘం మెడికల్ కమిటీ చైర్మన్ పచ్చిపులుసు కృష్ణారావు, సంఘం ఉపాధ్యక్షుడు వరదా సూరిబాబు, అమలాపురం వైశ్య సంఘం అధ్యక్షుడు నంబూరి సత్యనారాయణమూర్తి, కార్యనిర్వాహక కార్యదర్శి సింగంశెట్టి కుమార్ పాల్గొన్నారు.

ముత్యాలమ్మవారికి వెండి చీర అలంకరణ



తాళ్లరేవు ముత్యాలమ్మవారికి వెండిచీర సమర్పిస్తున్న దాత సూర్యనారాయణమూర్తి

తాళ్లరేవు: స్థానిక గ్రామదేవత ముత్యాలమ్మవారికి కేశవపురానికి చెందిన రిటైర్డ్ ఆర్మీ అధికారి జొన్నలగడ్డ సూర్యనారాయణమూర్తి వెండి చీరను సమరిప్పంచారు. రూ. 3 లక్షల వ్యయంతో తయారు చేయించిన వెండిచీరను శనివారం ఆలయ కమిటీ ప్రతినిధులకు సూర్యనారాయణమూర్తి అందజేసారు. ఈ సందర్భంగా వెండి చీరకు సంప్రోక్షణ నిర్వహించి అమ్మవారికి అలంకరించారు. ఈ కారక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు గంజా సూరిబాబు, వాసంశెట్టి శ్రీనివాస్, వనచర్ల చంద్రరావు, గుబ్బల శ్రీను, మర్ల ఫణిశర్మ, కొలను సత్యనారాయణమూర్తి, రామకృష్ణయ్య, సత్యవతి, సూర్యనారాయణమూర్తి, జొన్నలగడ్డ శ్రీనివాస్, వంక నాగమణి, చావలి రవి, మహాలక్ష్మి, యల్లమిల్లి సూరిబాబు, బొంతు శ్రీనివాస్, పినపోతు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

చేనేత రంగ అభివృద్ధికి పాటుపడదాం



గొలపల్లిని సత్కరిస్తున్న జాన జగదీష్ చంద్ర గణేష్

అమలాపురం రూరల్: వైఎస్సార్ సీపీ చేనేత విభాగం జిల్లా కమిటీ ఏర్పాటుకు సహకారం అందించాలని రాజోలు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్, మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావును జిల్లా చేనేత విభాగం అధ్యక్షుడు జాన జగదీషచంద్రగణేష్ కోరారు. శనివారం రాజోలులో గొల్లపల్లి సూర్యారావును కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా గొల్లపల్లి మాట్లాడుతూ జిల్లాలో, నియోజకవర్గంలో చేనేత అభివృద్ధికి కలిసి పాటుపడదామని, త్వరలోనే కమిటీలను ఏర్పాటు చేస్తామని తనను కలిసిన నేతలకు తెలిపారు. అనంతరం చేనేత విభాగం జిల్లా కమిటీ, మండల కమిటీలపై సమావేశంలో చర్చించారు. ఈ కార్యక్రమంలో చేనేతకు సంబంధించిన నేతలు మాడా కార్తీక్, గుమ్మడి వీరభద్రం, మావూరి శివ, చింతా సుధాకర్, ఇనుమర్తి నాగరాజు, బళ్ల సత్యనారాయణ పాల్గొన్నారు.

భూపరిపాలన అంశాలపై సమగ్ర పురోగతి సాధించాలి

అమలాపురం రూరల్: భూపరిపాలన అంశాలపై సమగ్ర పురోగతిని సాధించి సుపరిపాలన అందించే దిశగా ప్రభుత్వం ప్రతినెల భూ పరిపాలన రెవెన్యూ అంశాలపై సమీక్షిస్తోందని జిల్లా రెవెన్యూ అధికారి బీఎల్ఎన్ రాజకుమారి శనివారం తెలిపారు. భూపరిపాలన ప్రధాన కమిషనర్ కార్యాలయం ఆదేశాల మేరకు క్షేత్రస్థాయిలో ప్రతినెల భూ పరిపాలన రెవెన్యూ అంశాలపై పురోగతి సాధించేలా ఆర్డీఓలు తాహసీల్దార్లతో క్షేత్రస్థాయి అంశాలపై ప్రతినెల ఆశించిన పురోగతిని తీసుకువచ్చేలా సమీక్షిస్తున్నట్లు ఆమె వెల్లడించారు. జీవో– 30 భూముల క్రమబద్ధీకరణ–2025, అందరికీ ఇళ్లు కార్యక్రమంలో పురోగతి, రెవెన్యూ మంత్రి వివిధ జిల్లా కలెక్టర్లకు పంపిన విజ్ఞాపనలు, పిటిషన్లపై తీసుకున్న చర్యల నివేదిక కాలానుగుణ నివేదికలు, నీటి వనరులపై ఇతర సాధారణ ఆదేశాలతో తీసుకున్న చర్యల నివేదికలు, జిల్లా స్థాయి పర్యవేక్షణ ఆడిట్ కమిటీ ద్వారా భూమి వినియోగంపై నివేదిక.పెండింగ్‌లో ఉన్న కోర్టు కేసుల స్థితి లోకాయుక్తతో సహా, ఆడిట్ పేరాలు,క్రమశిక్షణా కేసుల విచారణ నివేదిక స్థితి, ప్రజా సమస్యల పరిష్కార వేదిక, జాతీయ రహదారులు రైల్వే లైన్లపై భూసేకరణ పురోగతి నివేదిక, నీటి పన్ను వసూలు, భూదాన్ భూములు, సీనియారిటీ జాబితాల తుది నిర్ణయం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలని రాష్ట్ర భూ పరిపాలన ప్రధాన కమిషనర్ జయలక్ష్మి, అదనపు కమిషనర్ ఎస్. ప్రభాకర్ రెడ్డి సూచించారని ఆర్డీఓ అన్నారు.

రచయిత్రి సుధకు తెలుగు వెలుగు పురస్కారం



రచయిత్రి సుధను ఎన్టీఆర్, పీవీ జాతీయ తెలుగు వెలుగు పురస్కారంతో సత్కరిస్తున్న ఆ సంస్థ ప్రతినిధులు

అమలాపురం టౌన్: అమలాపురానికి చెందిన రచయిత్రి పచ్చిగోళ్ల సుధకు తెలుగు వెలుగు జాతీయ పురస్కారం లభించింది. ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు దేశ వ్యాప్తంగా పని చేస్తున్న జాతీయ స్వచ్ఛంద సేవా సంస్థ తెలుగు వెలుగు సాహితీ వేదిక సుధకు ఈ పురస్కారాన్ని ప్రదానం చేసింది. మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ నందమూరి తారకరామారావు (ఎన్టీఆర్), మాజీ ప్రధాన మంత్రి పీవీ నరసింహరావు జయంతిని పురస్కరించుకుని తెలుగు వెలుగు సాహితీ వేదిక సమాజంలో తెలుగు భాషాభివృద్ధికి కృషి చేస్తున్న 20 మందికి ఎన్టీఆర్, పీవీ పురస్కారాలు ప్రదానం చేసింది. హైదరాబాద్ నగరం చిక్కడపల్లిలోని త్యాగరాయ గాన సభలోని కళావెంకట దీక్షితులు కళావేదికపై శనివారం నిర్వహించిన పురస్కారాల ప్రదానోత్సవ కార్యక్రమంలో రచయిత్రి సుధ ఈ పురస్కారాన్ని అందుకున్నారు. తెలుగు వెలుగు సాహితీ వేదిక ప్రతినిధులు ఈ సందర్భంగా సుధను సత్కరించి పురస్కారాన్ని అందించి అభినందించారు.